క్లుప్తంగా

లారీ బోల్తా: గొర్రెల మృతి

కొడవలూరు: గొర్రెల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పిన ఘటన మండలంలోని రాచర్ల పాడు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కావలి నుంచి నెల్లూరు వైపు వస్తున్న లారీ బోల్తా పడటంతో అందులో ఉన్న నాలుగు గొర్రెలు మృతి చెందాయి. కాగా ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

• డీడీఓ శోభారాణి



మాట్లాడుతున్న డీడీఓ

పొదలకూరు: హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా సాంఘిక సంక్షేమాధికారిణి శోభారాణి తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులై బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకాని వారి వివరాలను తెలుసుకునేందుకు మంగళవారం డీడీఓ స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేస్తామని, టెన్త్ విద్యార్థులు పది మంది ఉన్నా ట్యూటర్లను నియమించడం జరుగుతుందన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. పొదలకూరు ఏఎస్‌డబ్ల్యూఓ పరిధిలో ఉన్న పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల్లో తల్లికి వందనం పథకం 71 మందికి నగదు జమకాకుంటే పరిశీలించి 64 మంది పేర్లను సరిచేయడం జరిగిందన్నారు. వివిధ రకాల సాంకేతిక కారణాలతో వారికి నగదు జమకాలేదన్నారు. డీడీఓ వెంట ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరి సాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి సూచించారు. మండలంలోని కోడూరు – 1, కోడూరు – 2 గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ అధిక యూరియా వాడటం వల్ల తాలు గింజలు ఏర్పడటంతోపాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల రసాయనిక ఎరువులకు బదులుగా పచ్చిరొట్ట ఎరువులను వాడితే ఫలితం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నర్సోజీరావు, మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి, వ్యవసాయ, మత్స్య శాఖ సహాయకులు డయానా, శశి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల పేర్లను అన్ని గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించామని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని డేవిస్‌పేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులై ఉండి జాబితాలో తమ పేరు లేకపోతే త్వరలో ఓపెన్ చేయనున్న గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి, ఏఈఓ శ్రావణి, వీహెచ్‌ఏ మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడవలూరు: వరి సాగులో మెళకువలను పాటిస్తే నాణ్యమైన దిగుబడులను పొందొచ్చని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని కమ్మపాళెం, రాచర్లపాడుల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు. యూరియా అవసరమైన అన్నదాతలు రైతు సేవా కేంద్రంలో వీఏఏను సంప్రదించాలని కోరారు. ఏఓ విజయలక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు సుజిత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మి కోరారు. మండలంలోని దంపూరు, వావిళ్లలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం పొలాలను పరిశీలించి ఎరువుల వినియోగంపై సూచనలు చేశారు. సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఎంపీటీసీ భానుప్రసాద్, స్థానిక నేతలు శ్రీధర్‌నాయుడు, విజయరాఘవన్, రామ్‌ప్రసాద్, వావిళ్ల సర్పంచ్ శ్రీహరిరెడ్డి, కమతం శ్రీనాథ్, వీఏఏ పవన్, శరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ రివిజన్ సర్వేకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ట్యాక్స్ రివిజన్ సర్వేకు అత్యంత ప్రాధాన్యమిచ్చి.. ఆదివారం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ సెక్షన్‌తో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని సూచించారు. ఉదయం ఆరు నుంచే ప్రక్రియను ప్రారంభించి, గృహాలకు సంబంధించిన అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేయాలని కోరారు. నివేదికలను గూగుల్ షీట్స్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

• సీసీసీలో ఏర్పాటు చేసిన పెద్ద స్క్రీన్ ద్వారా నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన వీక్షించారు. చెత్త సేకరణ వాహనాలు నిత్యం ఎన్ని ట్రిప్పులు తిరుగుతున్నాయనే అంశంపై నివేదికలను అందజేయాలని కోరారు.

విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం



నెల్లూరు (టౌన్): రవాణా నిబంధనలను జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలు తప్పక పాటించాలని ఉప రవాణా కమిషనర్ చందర్ పేర్కొన్నారు. నగరంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సుల్లో విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. రూల్ 185 మేరకు 32 పాయింట్లను పాటించాలని సూచించారు. నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నామని వెల్లడించారు. ఎంవీఐలు రఫీ, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, మల్లికార్జునరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నివారణకు కృషి



హాజరైన ఆరోగ్య సహాయకులు



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా నివారణకు ఆరోగ్య సహాయకులు కృషి చేయాలని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. రీ డిప్లాయ్‌మెంట్‌లో భాగంగా బదిలీ అయిన ఆరోగ్య సహాయకులకు సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విధులకు సక్రమంగా హాజరుకావాలని, ఎఫ్ఆర్ఎస్ నమోదును వేయాలని కోరారు. అన్ని రకాల వ్యాధుల నివారణలో క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొనాలన్నారు. జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీల ప్రతినిధులతో డీఆర్వో భేటీ



నెల్లూరు(అర్బన్): పారదర్శకమైన ఓటర్ల జాబితా, ఎన్నికల్లో ఏజెంట్లు నిర్వహించాల్సిన పాత్రపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కలెక్టరేట్లోని తన చాంబర్‌లో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు మంగళవారం నిర్వహించారు. బీఎల్ఏ – 2 ఫారమ్‌లో బూత్‌లెవల్ ఏజెంట్ల ఫొటోలు, మొబైల్ నంబర్లను పొందుపర్చాలని కోరారు.

దేవరపాళెంలో ‘పొలం పిలుస్తోంది’



మాట్లాడుతున్న నాగమోహన్

నెల్లూరు రూరల్: మండలంలోని దేవరపాళెం, కొండ్లపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి నాగమోహన్ మాట్లాడారు. వరిలో ఆకుముడత పురుగు, మైట్ తెగులు ఉందని రైతులు తెలియజేశారని, దీనికి గానూ ఎలాంటి మందులను వాడాలో తెలియజేశారు. యూరియాను రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని వివరించారు. మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఏఈఓ బానోతు శ్రీనివాసులు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీసీబీలో విధులు నిర్వర్తిస్తూ, ఉద్యోగ విరమణ చేసిన రాఘవేంద్రరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో అంత్యక్రియల ఏర్పాట్ల కోసం డీసీసీబీ ద్వారా రూ.15 వేలు, విశ్రాంత ఉద్యోగుల సంఘం తరఫున రూ.పది వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాంతారావు, సభ్యులు నాగేశ్వరరావు, మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణ మహోత్సవం



విడవలూరు: మండలంలోని రామతీర్థంలో కొలువైన కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమర్పించారు. కల్యాణాన్ని వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ తదితరుల ఆధ్వర్యంలో జరిపారు. భక్తులు అశేషంగా హాజరయ్యారు. ఉభయకర్తలుగా ఓజిలి కృష్ణారెడ్డి ఆయన కుటుంబసభ్యులు వ్యవహరించారు. అన్నప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న అనూష

నెల్లూరు సిటీ: పరిశ్రమల్లో నిబంధనల మేరకు జాగ్రత్తలు పాటించాలని ఆర్డీఓ అనూష పేర్కొన్నారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన లోకల్ క్రైసిస్ గ్రూప్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రసాయన ప్రమాదాలను నివారించేందుకు చేపట్టాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పాటించాల్సిన చర్యలను వివరించారు. వెంకటాచలం మండలంలోని ఎనర్గాస్ పెట్రో ప్రొడక్ట్స్ సంస్థలో మాక్‌డ్రిల్‌ను బుధవారం నిర్వహించాలని సూచించారు. ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని వినతి



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు చట్టసభల్లో ఎంపీ, ఎమ్మెల్యేలుగా అవకాశం కల్పించకపోవడంతో వారు కనీస అవసరాలకు నోచుకోవడంలేదని, గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలని ఎస్టీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కేటాయించే రూ.కోట్లాది నిధులను సక్రమంగా వినియోగించకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడంలేదని తెలిపారు. నేతలు తెలపల జయవర్ధన్, శ్రీనివాసులు, హనుమంతునాయక్, ప్రసన్నకుమార్, యాటగిరి శివ, యాటగిరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలి



మాట్లాడుతున్న స్ఫూర్తిరెడ్డి

కొడవలూరు: సరుకుల పంపిణీలో పారదర్శకత అవసరమని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చౌక డిపోల డీలర్లతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. తూకాల్లో వ్యత్యాసాలున్నా, సకాలంలో సరుకులను పంపిణీ చేయకపోయినా సంబంధిత డీలర్‌పై చర్యలు తప్పవన్నారు. రేషన్ షాపులను తాను తరచూ తనిఖీ చేస్తానని తెలిపారు. డీటీ సారంగపాణి, ఆర్ఐ హైమావతి, డీలర్ల సంఘ అధ్యక్షుడు మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి




మాట్లాడుతున్న చంద్రశేఖర్



సమావేశానికి హాజరైన ఐద్వా, పొదుపు మహిళలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తాము అధికారంలోకి వస్తే పొదుపు రుణాలను మాఫీ చేస్తామని గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఐద్వా నేతలు డిమాండ్ చేశారు. పొదుపు మహిళల ఆర్థిక అభివృద్ధి సాధనకు గానూ నగరంలోని టౌన్‌హాల్ రీడింగ్ రూమ్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంక్, నవాబుపేట బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌బీ, శివకుమారి మాట్లాడారు. పొదుపు మహిళలకు వ్యక్తిగత రుణాలివ్వాలని కోరారు. అధికార పార్టీ నేతలు వారి కార్యక్రమాలు, జన సమీకరణ కోసం పొదుపు లీడర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆరోపించారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకొని వాటిని చెల్లించే క్రమంలో ఆలస్యమైతే దాడులు, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. కందుకూరు పట్టణ, నెల్లూరు రూరల్ ఐద్వా కార్యదర్శులు మున్వర్ సుల్తానా, షాహినా బేగం, నగరాధ్యక్షురాలు సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు శంషాద్, ప్రమీల, అరిగెల రమమ్మ, మహ్మద తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకాలు





నెల్లూరు(బృందావనం): జ్యేష్ఠమాస శివరాత్రిని పురస్కరించుకొని పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో మహన్యాసపూర్వక ఏకాదశ పూర్ణవార రుద్రాభిషేకం, శంకరభగవత్పాదులకు అర్చనలను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పూజలను నిర్మల్‌కుమార్‌శర్మ, చక్రాల ఆనంద్‌కుమార్, చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ, గన్నవరం ప్రభాకర్‌శర్మ జరిపారు. ఉభయకర్తగా పారా గురువెంకటశ్రీధర్‌శర్మ వ్యవహరించారు. అన్నవరం సత్యనారాయణ, లక్ష్మీసుజాత, నాగరత్నకుమారి, దుర్గాకృష్ణకుమార్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి, పద్మ, రాయప్రోలు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోటార్ల తొలగింపు



ముత్తుకూరు(పొదలకూరు): మండల కేంద్రమైన ముత్తుకూరులో అక్రమంగా వేసిన మంచినీటి బోర్లకు సంబంధించిన మోటార్లను మంగళవారం తహసీల్దార్ స్వప్న విద్యుత్ అధికారులు, సిబ్బంది ద్వారా తొలగించారు. ఇక్కడ బోర్లను అక్రమంగా వేసి ట్యాంకర్ల ద్వారా కృష్ణపట్నం పోర్టుకు నీటిని తరలిస్తున్నట్టు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయడంతో చర్యలు చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలాల్లో కొందరు అనుమతి లేకుండా బోర్లను నిర్మించి విద్యుత్ మోటార్లను అమర్చి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు అందడంతో తహసీల్దార్ విద్యుత్ అధికారుల ద్వారా విద్యుత్ కనెక్షన్లను తొలగించి మోటార్లను స్వాధీనం చేసుకున్నారు.

రొట్టెల పండగ ఏర్పాట్ల పరిశీలన



నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

క్రైమ్ కార్నర్

గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

నెల్లూరు సిటీ: గడ్డి మందును సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. నెల్లూరు రూరల్ పోలీసులు సమాచారం మేరకు.. కోవూరు మండలంలోని వేగూరుకు చెందిన హరీష్ (32) నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. విభేదాల నేపథ్యంలో భార్య తన పుట్టింటికి కొన్ని రోజుల క్రితం వెళ్లారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన హరీష్.. జాతీయ రహదారి సమీపంలోని పద్మావతి గ్రీన్ సిటీలో గడ్డి మందును ఈ నెల 16న సేవించి సోదరుడికి ఫోన్ చేశారు. వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆయన్ను తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మనుమసిద్ధినగర్‌కు చెందిన మునికుమార్, శైలజకు పదేళ్ల క్రితం వివాహం కాగా, వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అదనపు కట్నం కోసం ఆమెను భర్త, అత్తమామలు కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా హింసించసాగారు. ఈ క్రమంలో ఈ నెల 15న ఆమెను భర్త తీవ్రంగా కొట్టారు. అనంతరం భార్య, పిల్లలను ఆమె పుట్టింట్లో వదిలివెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి (40) ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ సమీపంలో బర్మాషెల్‌గుంట వైపు వెళ్లే రహదారిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటంతో నవాబుపేట పోలీసులకు రైల్వే అధికారులు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మరణించి పది రోజులై ఉండొచ్చని, పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఉంటారని తెలిపారు. జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుదువ దుకాణంలో చోరీకి యత్నం

నెల్లూరు(క్రైమ్): కుదువ దుకాణంలో చోరీకి ఇద్దరు యువకులు విఫలయత్నం చేశారు. వివరాలు.. మండపాలవీధిలో ఓ భవనం కింది భాగంలో కుదువ దుకాణం ఉండగా, పైపోర్షన్లో యజమానులు నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ముఖానికి మాస్కులను ధరించి దుకాణం వద్దకు మంగళవారం తెల్లవారుజామున వచ్చారు. తమ వెంట తెచ్చుకున్న గడ్డపారతో షట్టర్‌ను తెరిచేందుకు యత్నించగా, శబ్దాలను సమీప అపార్ట్‌మెంట్‌లోని వాచ్‌మెన్ విన్నారు. ఆయన రావడాన్ని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. దుకాణ యజమాని సైతం అక్కడికి చేరుకున్నారు. ఘటనపై సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలంతో పాటు సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. తెలిసిన వారి పనై ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



నెల్లూరు(బారకాసు): హరనాథపురంలోని ఖాళీ స్థలాల్లో హెచ్చరిక బోర్డులను నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులకు గానూ సదరు యజమానులు సరైన అధికారిక పత్రాలతో వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని సూచించారు. రెవెన్యూ అధికారి సమద్, ఆర్ఐ రవి పాల్గొన్నారు.

షర్మిల వ్యాఖ్యలు హాస్యాస్పదం

నెల్లూరు రూరల్: బీజేపీపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని పార్టీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అనేక అపవిత్ర పొత్తులు పెట్టుకుందని విమర్శించారు. తమ పార్టీపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు పనుల దృష్ట్యా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బుధవారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీ, జెడ్పీ కాలనీ, సంజయ్‌గాంధీనగర్, ఇందిరాగాంధీనగర్, పొదలకూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.